యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ

- నిల్వలున్నా రైతుల్లో ఆందోళనలు సృష్టించే ప్రయత్నంలో కొందరు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉన్నదని, కలెక్టర్లు, ఆయా జిల్లాల్లో ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే రైతుల్లో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రబీకి అవసరమైన 10.40 లక్షల టన్నుల యూరియాలో ఇప్పటికే నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశామని వెల్లడించారు. గతేడాది డిసెంబర్‌తో పోలిస్తే ఈ డిసెంబర్‌లో రైతులు లక్ష టన్నుల యూరియాను అదనంగా కొనుగోలు చేసారని తెలిపారు. గత రబీ సీజన్‌లో 79.54 లక్షల ఎకరాల్లో సాగు కాగా..ఈ సంవత్సరం 13.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని పేర్కొన్నారు. అవసరమైన మేరకు రాష్ట్రానికి యూరియా నిల్వలు తెప్పించి ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నామని వివరించారు. అందరూ ఒకే కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా మండలాల్లోని అన్ని రిటైల్ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. యాప్ అమలవుతున్న జిల్లాల్లో యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ ఐదు జిల్లాల్లో దాదాపు లక్ష మంది రైతులు యాప్ ద్వారా 3.19 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేసినట్టు వెల్లడించారు.

యూరియా సరఫరాపై పర్యవేక్షణ

యూరియాను రైతులకు సకాలంలో అందేలా, పక్కదారి పట్టకుండా చూసేందుకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ప్రత్యేక అధికారులను నియమించిన విషయం విదితమే. ప్రత్యేక అధికారులు తమ కేటాయించిన జిల్లాల్లో యూరియా నిల్వలు, సరఫరా, అమ్మకాల తీరుపై ఆరా తీస్తున్నారు. కొందరు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి యూరియా అమ్మకం కేంద్రాల్లో తనిఖీలు చేశారు. జిల్లాల వారీగా యూరియా నిల్వలు, అమ్మకాలు, రైతుల అవసరాలపై ఎప్పటికప్పుడు వివరాలను తెప్పించుకుంటున్నారు.

జనవరి 6 వరకు అసెంబ్లీ

- నేడు కృష్ణా, గోదావరిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్...
- 2న ఉపాధి హామీపై సభలో లఘు చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ సమావేశాలు జనవరి 6 వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి)లో స్పష్టత రాలేదు. బిఎసి సమావేశం అనంతరం బిజినెస్‌కు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేస్తారు. అందుకు భిన్నంగా ఈసారి ఎలాంటి అధికార ప్రకటన చేయలేదు. దాంతో ఎన్ని రోజులు నిర్వహిస్తారనే అంశంపై సర్కార్ తీసుకునే నిర్ణయమే ఫైనల్ కానుంది. అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం జనవరి ఆరు లేదా ఏడు వరకు నడపనున్నట్టు తెలుస్తోంది. జనవరి రెండున ఉపాధి హామీపై సభలో లఘు చర్చ జరగనుంది. మహాత్మాగాంధీ ఉపాధి హామీ స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన విబి జి ఆర్‌ఎఎం జి స్కీం వల్ల తెలంగాణ ఏటా రూ.1,200 కోట్లు నష్టపోనుంది. అలాగే కార్మికుల పనిదినాలు, వేతనాలు, ఇతర అంశాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ స్కీంను రద్దు చేసి పాత చట్టానే కొనసాగించాలని అసెబ్లీలో తీర్మానం చేయనున్నట్టు సమాచారం. ఈ అంశంపై బిజెపి మినహా అన్ని పార్టీల సభ్యులు అంగీకారం తెల్పే అవకాశం. ఉంది. జనవరి నాలుగున ఆదివారం కావడంతో సభ జరిగే అవకాశాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో మూడున గోదావరి, ఐదున కృష్ణా జలాలపై సభలో చర్చ జరిగే అవకాశం ఉంది. తెలంగాణ నీటి వాటాల విషయంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్‌ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న క్రమంలో ఏర్పాటు చేసిన శాసనసభా సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పాలమూరు-రంగారెడ్డి, పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్ట్‌లపై క్యూసెక్కులు, టిఎంసిలు, అంకెలు, సంఖ్యలతో రెండు పార్టీలు అసెంబ్లీ వేదికగా నీళ్ల యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నేడు ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు.

సమస్యలను ఎదురొడ్డిన పివి

- సమస్యలను ఎదురొడ్డిన మాజీ ప్రధాని
- డాక్టర్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు గట్టెక్కించారని ప్లానింగ్ కమిషన్ మాజీ డిప్యూటీ చైర్మన్ డాక్టర్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా కొనియాడారు. పివి నరసింహారావు మెమోరియల్ లెక్చర్ కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కె రామచంద్రమూర్తి అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ఇచ్చారు. అహ్లూవాలియా మాట్లాడుతూ తీసుకునే నిర్ణయాల పట్ల పివి కట్టుబడి ఉండేవారని తెలిపారు. పివి ప్రధానమంత్రిగా పదవిచేపట్టే నాటికి ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ ఎకానమీ పెరుగుతున్నదనీ, అందుకనుగుణంగా ఆర్థిక సంస్కరణలు తీసుకున్నారని తెలిపారు. ఆ కొద్ది కాలంలోనే వెలుగులోకి వచ్చిన హర్షద్ మెహతా స్కాంకు పివి తీసుకున్న ఆర్థిక సంస్కరణలే కారణమని విమర్శకులు నిరాధార ఆరోపణలు చేశారని చెప్పారు. పార్లమెంటు లోపలా, బయట విమర్శలు పెరిగిపోవడంతో నాటి ఆర్థికశాఖ మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ రాజీనామాకు సిద్ధపడితే, పీవీ వెన్నంటి ఉండి రాజీనామాను తిరస్కరించడమే కాకుండా ఆయన్నే ఆర్థిక మంత్రిగా కొనసాగించారని వివరించారు. రాజకీయంగాను స్థిరత్వం కోసం ఎప్పటికప్పుడు ఆర్థిక సంస్కరణలకు ఆటంకాలు రాకుండా అమలు చేస్తూ దేశం అభివృద్ధి చెందడానికి అవసరమైన పునాదులు వేశారన్నారు. నాటి సంస్కరణల పుణ్యమే నేడు వృద్ధి రేటు పెరిగిందని తెలిపారు. నేటి తరం పివి నరసింహారావు గురించి తెలుసుకోవాలని ఆయన సూచించారు. నాటి పరిస్థితుల్లో ఉన్న సమస్యలకు భిన్నంగా దేశం ప్రస్తుతం భిన్నమైన సమస్యలను ఎదుర్కొంటున్నదని తెలిపారు. ఏఐ, ఆటోమొబైల్ టెక్నాలజీ సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా పెరుగుతున్నదని, దీంతో ఉద్యోగుల అవసరత తగ్గిపోతూ, నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వీటితో పాటు వాతావరణ మార్పులు సమస్యలు కూడా దేశం ఎదుర్కొంటున్నదని చెప్పారు. ఈ ఇబ్బందుల నుంచి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు.

సిపిటిపిపిలో సభ్యత్వం తీసుకోవాలి

భారతదేశం కాంప్రిహెన్సివ్ అండ్ ప్రొగ్రెసివ్ అగ్రిమెంట్ ఫర్ ట్రాన్స్- పసిఫిక్ పాట్నర్ షిప్ (సిపిటిపిపి)లోలో సభ్యత్వం తీసుకోవాలని అహ్లువాలియా సూచించారు. యుకె, యూరోపియన్ యూనియన్ లాంటి భాగస్వాములతో కలిసి వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరపడం మంచిదని అభిప్రాయపడ్డారు. దేశీయ మార్కెట్‌కు అవకాశాలు కల్పించేందుకు సిపిటిపిపిలో చేరడం అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో పి.వి.నరసింహారావు కూతురు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, కుమారుడు పి.వి.ప్రభాకర్ రావు, ఎమెస్కో విజయ కుమార్ పాల్గొన్నారు.

సంక్రాంతి లోపే 'వర్కర్ టు ఓనర్' ప్రారంభించాలి

- నేతన్నల సమస్యలపై మహాధర్నా
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి లోపే 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని ప్రారంభించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేతన్నల సమస్యలు, ప్రభుత్వ విధానాలపై బీఆర్‌ఎస్ మహాధర్నా నిర్వహిస్తుందని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అపెరాల్ పార్క్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వర్కర్ టు ఓనర్' అనే విప్లవాత్మక కార్యక్రమాన్ని సంక్రాంతి లోపలే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్లుగా ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తోందని విమర్శించారు. గతంలో రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా పవర్ లూమ్‌లను సబ్సిడీపై కొనుగోలు చేయడానికి అవసరమైన నిధులను వచ్చే బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో కేటాయించాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి లోపలే ఆసాముల లిస్టును ఫైనల్ చేసి, అర్హులైన నేత కార్మికులకు లెటర్లు ఇవ్వాలని కోరారు. ఒకవేళ సంక్రాంతి లోపల ఈ ప్రక్రియ పూర్తి చేయకపోతే, సంక్రాంతి అనంతరం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల నేత కార్మికులందరినీ సమీకరించి ఆందోళనకు దిగుతామన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఉన్న మూడంచెల వ్యవస్థను అధ్యయనం చేయాలని బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ అధికారులను ఆదేశించారని చెప్పారు. కార్మికులు, ఆసాములు, సేట్లు అనే వ్యవస్థలో కార్మికుడు కార్మికుడిగానే మిగిలిపోవాల్సిన పరిస్థితి ఎందుకు ఉండాలని ప్రశ్నిస్తూ, కార్మికుడిని ఆసామిగా మార్చే విప్లవాత్మక ఆలోచనతో 'వర్కర్ టు ఓనర్' కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇది దేశంలోనే కాక, బహుశా ప్రపంచంలోనే ఎక్కడా లేని వినూత్న పథకమన్నారు. బీడీలు చుడుతూ ఆరోగ్యాన్ని కోల్పోతున్న మహిళలకు మంచి వాతావరణంలో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో సిరిసిల్ల పట్టణం పక్కనే 200 ఎకరాల్లో అపెరాల్ పార్కును, దానికి అనుసంధానంగా వర్కర్ టు ఓనర్ కార్యక్రమాన్ని రూ.400 కోట్లతో కేసీఆర్ ప్రారంభించారని వివరించారు. దాదాపు 50 షెడ్ల నిర్మాణాలు రెండేండ్ల కిందటే పూర్తయ్యాయని, పవర్ లూమ్‌లను సబ్సిడీపై అందించి కార్మికులనే యజమానులుగా మార్చాలనే ఆలోచన అందులో భాగమేనని అన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నేత కార్మికులు ఆసాములుగా, వర్కర్ ఓనర్లుగా మారాలని, సిరిసిల్ల ఒక తిరుపూర్ మాదిరిగా వేల కోట్ల రూపాయల వస్త్ర ఉత్పత్తి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తాం

- కొత్త సంవత్సరంలో మెరుగైన వైద్యసేవలందిస్తాం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కొత్త సంవత్సరంలో ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామనీ, కొత్త సంవత్సరంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీనిచ్చారు. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2026లో నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ నివారణ, నియంత్రణ, చికిత్స, పాలియేటివ్ కేర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఇప్పటికే ఎన్‌డిడిసి క్లినిక్స్, కేర్ కేన్సర్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల సమీపంలోకి వైద్యసేవలను తీసుకెళ్లామని మంత్రి గుర్తుచేశారు. ఎమర్జెన్సీ కేర్‌పై మరింత దృష్టి సారించామనీ, వందకుపైగా క్రిటికల్ కేర్ బ్లాక్స్, ట్రామా కేర్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొస్తామని హామీనిచ్చారు. కొత్త ఏడాదిలో నాలుగు కొత్త మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను తీసుకొస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని పేర్కొన్నారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.713 కోట్లు విడుదల

- ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల్లో డిసెంబర్‌కు సంబంధించిన రూ.713 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు డిసెంబర్‌కు చెందిన రూ.713 కోట్ల బిల్లులను బుధవారం విడుదల చేశారు. ప్రతినెల రూ.700 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులను విడుదల చేస్తామంటూ ఉద్యోగ సంఘాలకు ప్రజా ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత ఆగస్టు నుంచి ప్రతినెలా కనీసం రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ విడుదల చేస్తూ వచ్చింది. ఉద్యోగుల గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవులు, అడ్వాన్స్‌లకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం విడుదల చేసింది. డిసెంబర్‌కు సంబంధించి రూ.713 కోట్లు పెండింగ్ బిల్లుల కోసం విడుదల చేయడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనవరి ఒకటి నుంచి 31వ తేదీ వరకు జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని రాష్ట్ర రవాణా శాఖ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో రోడ్డు భద్రతా మాసోత్సవం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. 30 రోజుల ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని హామీపత్రం ఇవ్వాలని కోరారు. ప్రతిపాఠశాల రోడ్డు భద్రతా క్లబ్‌లో చేరాలని సూచించారు. రవాణా శాఖ సూచనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనం నడపరాదని, రాంగ్ రూట్లో ప్రయాణం చేయకూడదని, అతివేగంతో వాహనం నడపొద్దని వివరించారు. రోడ్డు ప్రమాదాల వల్లే మరణాలు అధికంగా జరుగుతున్నాయని అధికారక లెక్కలు చెబుతున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతోపాటు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

30 రోజుల ప్రణాళిక విడుదల

రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా రవాణా శాఖ 30 రోజుల ప్రణాళికను రవాణా శాఖ విడుదల చేసింది. జనవరి ఒకటి నుంచి 31 వరకు వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించింది. ఒకటిన హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా సిటు బెల్ట్ పెట్టుకోవడం, హెల్మెట్ ధరించడం, విద్యార్థులు, యువతన భాగస్వామ్యం చేయడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. 31న ముగింపు సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులతోపాటు ఇతరులకు అవార్డులు ఇస్తారు.

ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు వెంటనే విడుదల చేయాలి

- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు అందాల్సిన రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం బొడ్రాయితండా ఎంపియుపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు పంజాల శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులకు రావాల్సిన కొత్త పిఆర్‌సి ప్రక్రియలను వేగవంతం చేసి, వెంటనే అమలు చేయాలని కోరారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతన సవరణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల భవిష్యత్‌కు భరోసానిచ్చే పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని అన్నారు. సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రావాల్సిన గ్రాట్యుటీ వంటి తదితర ప్రయోజనాలను నెలల తరబడి పెండింగ్ పెట్టడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, యుటిఎఫ్ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొని పంజాల శ్రీనివాస్‌పద్మ దంపతులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మి అధ్యక్షత వహించారు. సర్పంచ్ సంపూర్ణ, ఎఎంసి చైర్మన్ వసంత, ఎంఇఒ లక్ష్మి, చిలుకోడు, ముల్కలపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోర వీరభద్రం, స్వామి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే యాకోబ్, బిసిటియు రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, పిఆర్‌టియు జిల్లా కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 వేల కోట్ల ఆస్తిపన్ను వసూలే లక్ష్యం

- కొత్త డంపింగ్ యార్డుల కోసం భూ సేకరణ
- జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పరిశుభ్రతలో హైదరాబాద్ మహానగరాన్ని అగ్ర స్థానంలో నిలపడమే లక్ష్యంగా 2026లో పనిచేయనున్నట్లు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో జిహెచ్‌ఎంసి ఆరో ర్యాంకు సాధించిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు రెండు వేల కిలోమీటర్ల వరకు పరిధి విస్తరించిన క్రమంలో 300 వార్డుల నుంచి రోజుకు తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు. చెత్త నిర్వహణకు కొత్త డంపింగ్ యార్డుల కోసం భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. సిఎం ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై 300 వార్డుల్లో నిరంతరం ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తామని వివరించారు. గ్రేటర్‌లో పారిశుద్ధ్యం సహా వివిధ అభివృద్ధి పనులు, పరిపాలన అంశాలపై సమగ్ర వివరాలు వెల్లడించిన ఆర్‌వి కర్ణన్.... వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జీఐఎస్ సర్వే ద్వారా 14 లక్షల ప్రాపర్టీలను సర్వే చేసినట్లు పేర్కొన్నారు. అందులో లక్ష మంది.. కట్టాల్సిన ఆస్తి పన్ను కంటే తక్కువగా చెల్లిస్తున్నట్లు గుర్తించామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే నగర పౌరులు తమ ఆస్తి పన్ను నేరుగా జీహెచ్‌ఎంసీ వెబ్ సైట్, యాప్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. నగరంలో రవాణా సదుపాయం మరింత మెరుగుపర్చేందుకు పెండింగ్ లో ఉన్న ఫ్లైఓవర్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని, హెచ్ సీటీ ప్రాజెక్టు కింద చేపట్టిన 32 ప్రాజెక్టులకు త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్వీ కర్ణన్ ప్రకటించారు.

యూట్యూబర్ అన్వేష్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూట్యూబర్ అన్వేష్‌పై కేసు నమోదైంది. ఇటీవల సోషల్ మీడియాలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ సినీనటి కరాటే కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అభ్యంతర కంటెంట్ ప్రచారం చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో అన్వేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అన్వేష్‌పై ఖమ్మంలోని ఖానాపురంహవేలి ఠాణాలోనూ ఇప్పటికే కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ కథనం మేరకు.. విశాఖపట్నానికి చెందిన అన్వేష్ అనే యువకుడు విదేశాల్లో ఉంటూ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా హిందువులు పూజించే సీతాదేవి, ద్రౌపదీదేవిలపట్ల అసభ్యంగా ఇటీవల అతడు వీడియో విడుదల చేశాడు. దానవాయిగూడేనికి చెందిన జి సత్యనారాయణరావు అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- తాగిన వారు డ్రైవింగ్ చేయకుండా క్యాబ్‌లలో వెళ్లాలి : సిపి సజ్జనార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సర వేడుకల్లో నగంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని హైదరాబాద్ సిపి విసి సజ్జనార్ తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలో నుంచి క్షేత్రస్థాయి అధికారులతో సీపీ విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు సలహాలు చేశారు. ముఖ్యంగా ఈవెంట్ల సమయపాలన, మద్యం విక్రయాలు, ట్రాఫిక్ నిబంధనలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. న్యూఇయర్ ఈవెంట్లు, వేడకలకు అర్ధరాత్రి ఒంటి గంట వరకు మాత్రమే అనుమతించామని చెప్పారు. ఆ సమయం దాటి వేడుకలు నిర్వహించినా, నిబంధనలకు విరుద్ధంగా సౌండ్ సిస్టమ్స్ వినియోగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని గుర్తించేందుకు ఈసారి ముందుగానే తనిఖీలు చేపట్టామన్నారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి 120 ప్రాంతాల్లో 'డ్రంక్ అండ్ డ్రైవ్' సోదాలు నిర్వహించినట్టు తెలిపారు. మద్యం మత్తులో పట్టుబడితే భారీ జరిమానా, జైలు శిక్షతోపాటు లైసెన్స్ రద్దు, వాహనాల సీజ్ చేస్తామన్నారు. జనవరి మొదటి వారం వరకు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని సీపీ తెలిపారు. మద్యం సేవించిన వారు డ్రైవింగ్ చేయకుండా క్యాబ్ లేదా డ్రైవర్లను ఆశ్రయించాలన్నారు. క్యాబ్, ఆటో డ్రైవర్లు అదనపు చార్జీలు డిమాండ్ చేసినా చర్యలు తప్పవన్నారు.

తెలంగాణ పర్యాటకానికి మహర్దశ

- రూ.22 వేల కోట్ల ఒప్పందాలు
- 90 వేల కోట్ల ఉద్యోగాల సృష్టి
- విజయాలు, లక్ష్యాల ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్దేశంలో తెలంగాణ పర్యాటక శాఖ అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి సాధించిందని తెలంగాణ పర్యాటక శాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. 2025 సంవత్సరంలో పర్యాటక శాఖ సాధించిన ప్రగతిని, 2026లో సాధించబోయే లక్ష్యాలు భవిష్యత్ ప్రణాళికలను ఆ శాఖ అధికారులు ప్రకటించారు.

విజయాలు

ఎకో, మెడికల్, హెరిటేజ్, గ్రామీణ, గిరిజన, సినిమా, వెడ్డింగ్ డెస్టినేషన్, స్పోర్ట్స్ టూరిజంపై దృష్టి సారించి తెలంగాణ టూరిజం విధానం 2025-2030ని అమల్లోకి తెచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసినట్టు వివరించారు. టూరిజం కాంక్లేవ్ 2025 ద్వారా 30 ప్రాజెక్టులకుగాను రూ.15,279 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగినట్టు చెప్పారు. తద్వారా సుమారు 50 వేల ఉద్యోగావకాశాలు లభించనున్నాయని అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ.7045 కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాల సృష్టి జరగనుందన్నారు. ముఖ్యంగా ఫుడ్‌లింగ్ గ్లోబల్ సెంటర్ రూ. 3000 కోట్లు, సారస్ ఇన్‌ఫ్రా రూ. 1000 కోట్లు, స్మార్ట్ మొబిలిటీ రూ. 1000 కోట్లు వంటి సంస్థలు భారత పెట్టుబడులతో ముందుకు వచ్చాయని వివరించారు. ప్రపంచ సుందరి పోటీలను ఘనంగా నిర్వహించినట్టు తెలిపారు. హైదరాబాద్‌ను పెట్టుబడులకే కాకుండా వ్యాపారానికి సురక్షిత, అనుకూలమైన రాష్ట్రంగా నిరూపితమైందని వివరించారు. బతుకమ్మ పండుగను ప్రపంచ వేదికపై నిలబెడుతూ, అతిపెద్ద బతుకమ్మ(19.44 మీటర్లు), 1354 మంది మహిళలతో అతిపెద్ద జానపద నృత్యం ప్రదర్శించి సెప్టెంబరు 29, 2025న రెండు గిన్నిస్ రికార్డులు సాధించామని ప్రకటించారు.

లక్ష్యాలు

2026 సంవత్సరానికి స్పష్టమైన ప్రణాళికను పర్యాటక శాఖ ప్రకటించింది. హైదరాబాద్- సోమశిల- శ్రీశైలం సర్క్యూట్‌లో హెలీ టూరిజం సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేనున్నారు. నాగార్జునసాగర్, సోమశిల, బస్వాపూర్ కొత్త వెడ్డింగ్ డెస్టినేషన్ల అభివృద్ధి చేయనున్నారు. మెడికల్ టూరిజం సొసైటిని స్థాపించి, హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. జనవరి 13, 14, 15న అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ షోలను నిర్వహించనున్నారు. ఇందులో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ, 55 మంది జాతీయ కైట్ ప్లేయర్ల భాగస్వాములు కానున్నారు. హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ 2026, జనవరి 16 నుంచి 18 వరకు ఐరోపా దేశాలకు నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ 15 బెలూన్లల్లో ప్రదర్శన గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 13, 14న హైటెక్ డ్రోన్లతో వినూత్న ప్రదర్శన ఉంటుందని గుర్తు చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్‌పై సారించినట్టు వివరించారు.

డిగ్రీ సిలబస్‌లో మార్పులు

- ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిగ్రీ సిలబస్‌లో మార్పులు చేయనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2026 సంవత్సరంలో పాలనాపరమైన సంస్కరణలు, నైపుణ్యాధారిత ఉన్నత విద్యా కోర్సులను తీసుకురానున్నట్టు తెలిపారు. అకడమిక్ ఆడిట్‌ను వేగవంతం చేస్తామని, దోస్త్ ద్వారా సకాలంలో సీట్లను భర్తీ చేస్తామని, అన్ని కోర్సుల్లోనూ వేగంగా కౌన్సిలింగ్ చేపడుతామనీ, ఇంజినీరింగ్ యాజమాన్య కోటా సీట్ల భర్తీని ఆన్‌లైన్‌లో చేస్తామని వెల్లడించారు. మండలి వెబ్‌సైట్‌ను మరింత సరళీకరించి ఉన్నత విద్య సమాచారాన్ని విద్యార్థులు సులభంగా పొందేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. దోస్త్‌లో గతంలో మాదిరిగా సీట్లు మిగిలిపోకుండా కోర్సులు, సీట్ల హేతుబద్ధీకరణ ప్రధాన ఎజెండాగా తీసుకుంటామని వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.

హనీ ట్రాప్ ముఠా గుట్టురట్టు

- ఆరుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో హనీ ట్రాప్ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పట్టణంలోని ఓ వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను బుధవారం అరెస్టు చేశారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి కొన్ని రోజుల క్రితం ఓ మహిళ ఫోన్ చేసి ప్రేమగా మాట్లాడింది. మాటలు కలిపి పరిచయం పెంచుకుంది. ఆ తర్వాత పట్టణ శివారులో ఓ గదిని అద్దెకు తీసుకొని ఇద్దరూ ఏకాంతంగా గడిపారు. ఆ సమయంలో హనీట్రాప్ ముఠా సభ్యులు వీడియోలు, ఫోటోలు తీశారు. మరుసటి రోజు సదరు వ్యాపారికి వీడియో, ఫొటోలు వాట్సప్ చేసి.. రూ.పదిలక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలు వైరల్ చేస్తామని బెదిరించారు. ఆ ముఠాకు భయపడకుండా.. వ్యాపారి ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. మహిళతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ ముఠాకు చెందిన మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ నమ్మి మోసపోవద్దని సిఐ అనిల్ కుమార్ ప్రజలకు సూచించారు. ఎవరైనా ఇలాంటి వేధింపులకు గురి చేస్తే భయపడకుండా నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు.

టెకీ హత్య కేసులో భార్యతో పాటు మరో ఐదుగురు మహిళలకు జీవితఖైదు

- జగిత్యాల జిల్లా కోర్టు సంచలన తీర్పు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు రాచర్ల పవన్‌కుమార్ (38) సజీవదహనం కేసులో జగిత్యాల జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. మృతుడి భార్యతో పాటు మరో ఐదుగురు మహిళలకు జీవితఖైదు విధిస్తూ న్యాయమూర్తి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

జగిత్యాలకు చెందిన విజయ్.. కొండగట్టుకు దాదాపు 1.5 కిలోమీటర్ల దూరంలో మంజునాథ ఆలయాన్ని, దాని పక్కనే కుటీరాన్ని నిర్మించుకున్నారు. విజయ్ తమ్ముడు జగన్ అనారోగ్యంతో మృతి చెందారు. విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బావ పవన్‌కుమార్, భార్య కృష్ణవేణితో కలిసి 2020 అక్టోబరు 28న రాత్రి మంజునాథ ఆలయానికి చేరుకున్నారు. పవన్‌కుమార్ చేతబడి చేయించి తన భర్తను చంపించాడనే అనుమానంతో అక్కడే ఉన్న జగన్ భార్య సుమలత బంధువులతో కలిసి అతన్ని కుటీరంలోని ఓ గదిలో బంధించింది. అందరూ కలిసి.. పవన్ ఒంటిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. పోలీసులు వచ్చి గది తాళం తీసే సరికే పవన్‌కుమార్ పూర్తిగా దహనమయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పవన్ కుమార్ భార్య కృష్ణవేణితో పాటు మరో ఐదుగురి మహిళలను నిందితులుగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జగిత్యాల మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.నారాయణ ఆరుగురు మహిళలకు జీవిత ఖైదు, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PRODDATUR

O.S.No. 173/2011

Koneti Mohan Reddy, S/o Narasimha Reddy, aged 55 years, Business residing at D/No.22/152, Vasanthapeta, Proddatur town and Mandal, Kadapa District. **...Plaintiff**

Vs

D4.K.Ramulamma, W/o Nagi Reddy, aged 50 years, Hindu, resident of S.R.Nagar Near Yellamma Temple, Hyderabad.

D9.Y. Venkata Lakshmi, W/o Rajesa, aged 36 years, Hindu, House wife, resident of Kukatpalli, Hyderabad.

...Defendants D4 and D9

దావా సమను

పై నెంబరు దావాలో వాది, 2వ ప్రతివాది అయిన జి.వెంకటసుబ్బారెడ్డి పై దావా దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావా యందు 2వ ప్రతివాది గతించినందున అతని వారసులుగా దావా యందు డి4 మరియు డి9 ప్రతివాదులు అయిన మీ ఇరువురిని చేర్చుయున్నారు. అట్టి దావాలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల 7.1.2026వ తేదీన పై కోర్టు యందు ఉదయం 10.30 ని॥లకు హాజరు కావలెయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 7.1.2026

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

C.SYAMA SUNDARA REDDY
Advocate, PRODDATUR.

ఎఐపిటిఎఫ్ దక్షిణాది కో ఆర్డినేటర్‌గా షౌకత్ అలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య (ఎఐపిటిఎఫ్) దక్షిణ భారతదేశ కోఆర్డినేటర్‌గా సయ్యద్ షౌకత్ అలీ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐపీటీఎఫ్ జాతీయ అధ్యక్షులు సుశీల్‌కుమార్ పాండే బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు. మూడేళ్లపాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. దక్షిణ భారతదేశ కోఆర్డినేటర్‌గా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతోపాటు పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాన్ని షౌకత్‌అలీ పర్యవేక్షిస్తారు. సుశీల్‌కుమార్ పాండేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తానని, దక్షిణ భారత దేశానికి చెందిన శాఖలను బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల్లోని అధ్యక్ష, కార్యదర్శులు తనకు సహాయ, సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేశారు.

స్టడీ టూర్ విహారయాత్ర కోసమేనా?

- అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ ఎం శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు అందరూ త్వరలో స్టడీ టూర్ చేయాలని జిహెచ్‌ఎంసి కౌన్సిల్ తీర్మానించడం సరిగాదనీ, పదవీకాలం ముందు టూర్‌కెళ్లి ఏం అధ్యయనం చేస్తారని తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ ఎం.శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారి పదవీకాలం 2026 ఫిబ్రవరి మొదటి వారంలో ముగుస్తుండగా ఇప్పుడు స్టడీ టూర్ చేయడం ఎందుకు అని నిలదీశారు. దేశంలోని వివిధ నగరాల్లో పర్యటించి అధ్యయనం చేసి వచ్చి వాటిని హైదరాబాద్‌లోని అమలు చేయగలిగే పరిస్థితి ఉన్నదా? ఇది స్టడీ టూర్ కాకుండా కార్పొరేట్ల విహారయాత్రగా మారుతుందని విమర్శించారు. దాని కోసం ప్రజాధనం అనవసరంగా ఖర్చు చేయడం ఎందుకు అని అడిగారు. వెంటనే స్టడీ టూర్‌ను రద్దు చేయాలని జిహెచ్‌ఎంసి మేయర్‌కు విజ్ఞప్తి చేశారు.

జాతివివక్ష మానవత్వానికే గొడ్డలిపెట్టు

- ఏంజెల్ చక్మా దారుణహత్యకు కెటిఆర్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతివివక్ష మానవత్వానికే గొడ్డలిపెట్టని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కెటిఆర్) విమర్శించారు. అది రాజ్యాంగ విలువలకే విఘాతమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెహ్రాడూన్‌లో త్రిపురకు చెందిన ఎంబీఏ విద్యార్థిని ఏంజెల్ చక్మా దారుణహత్యను ఖండించారు. ఈ ఘటన పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జాతివివక్ష ఏ రూపంలో ఉన్నా దాన్ని సహించొద్దని స్పష్టం చేశారు. వివక్ష, అధికార దుర్వినియోగం కలిస్తే ఎంత ఘోరమైన పరిణామాలు ఎదురవుతాయో ఈ సంఘటన గుర్తు చేస్తోందని తెలిపారు. ఇలాంటి నేరాలు కేవలం విడిగా జరిగిన సంఘటనలు కావనీ, ద్వేషాన్ని, వివక్షను సహించడం వల్ల కలిగే ముప్పుకు ఇవి ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. భారత్ ఇలాంటి విషాన్ని భరించలేదని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం అనే పునాదిపై నిర్మించబడిన దేశం ఇలాంటి విద్వేషాలను భరిస్తూ మనుగడ సాగించలేదని పేర్కొన్నారు. న్యాయం అందించడంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు. జాతివివక్ష అది ప్రత్యక్షంగా ఉన్నా పరోక్షంగా ఉన్నా దానిపై జీరో టాలరెన్స్ పాటించాలని తెలిపారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై నైతిక, రాజ్యాంగపరమైన బాధ్యత ఉందని పేర్కొన్నారు. జాతివివక్షతో కూడిన మాటలు, ప్రవర్తన, రెచ్చగొట్టే చర్యలను నేరంగా పరిగణిస్తూ కఠినమైన, స్పష్టమైన చట్టాలను తేవాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణ అరెస్టులు, విచారణ, శిక్షలు పడేలా చట్టంలో నిబంధనలు ఉండాలని సూచించారు. చట్టం తన పని తాను చేయాలనీ, బాధ్యత అనేది పక్షపాతంగా ఉండొద్దని కోరారు.

3, 4 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ సెమినార్

- విద్యారంగంలో మతోన్మాదంపై ప్రత్యేక చర్చ
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రజనీకాంత్, టి నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవరి 3, 4 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీకాంత్, ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రజనీకాంత్ మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం, ఐదేళ్లుగా విద్యారంగంలో చోటుచేసుకున్న మార్పులు, మతోన్మాద ధోరణులు, కార్పొరేటీకరణపై ఈ సెమినార్‌లో విస్తృత చర్చ జరగనుందని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో మతోన్మాద విధానాలు అమలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవస్థలను కూలదోసి, ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేస్తోందన్నారు. యుజిసి రద్దు, విద్యలో ఎఫ్‌డిఐలకు అనుమతి, విదేశీ విశ్వవిద్యాలయాల ఆహ్వానం, విద్యారంగం ప్రయివేటీకరణకు చర్యలు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై సెమినార్‌లో చర్చ జరగనుందని తెలిపారు. ఈ విధానాల వల్ల దళిత, గిరిజన, పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విద్యారంగానికి నిధులు తగ్గించడం, హాస్టల్ సదుపాయాల లోపం, నాణ్యమైన విద్య లేకపోవడం వంటి సమస్యలపై కూడా తీర్మానాలు చేయనున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. ఈ సెమినార్‌కు ప్రముఖ ఆర్థికవేత్త, ప్రొఫెసర్ ప్రభావత్ పట్నాయక్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి, న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ, పద్మశ్రీ అవార్డు గ్రహీత బాలహక్కుల ఫోరం చైర్మన్ ప్రొ.శాంతాసిన్హా, ఎస్‌ఎఫ్‌ఐ ఆల్ ఇండియా మాజీ అధ్యక్షులు ఆర్.అరుణ్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ అఖిలభారత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దర్శ్ ఎం.సాజీ, శ్రీజన్ భట్ట, అఖిల భారత ఉపాధ్యక్షులు శిల్ప, రోహిదాస్, అతిక్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మహానగరంలో ఈ జాతీయ కన్వెన్షన్‌ను నిర్వహించడం ద్వారా నూతన జాతీయ విద్యావిధానంపై పోరాటానికి తెలంగాణ వేదిక కానుందని అన్నారు. ఈ కన్వెన్షన్ సందర్భంగా జనవరి 3న ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, నాయకులు శ్రీమన్, నాగేందర్, స్టాలిన్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మూడో వారంలో మున్సిపల్ ఎన్నికలు

- 10లోపు ఓటర్ల తుది జాబితా
- 117 మున్సిపాల్టీలు, ఆరు కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధం
- అధికారులతో కలిసి ఎన్నికల సంఘం కసరత్తు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇటీవల పంచాయతీ ఎన్నికలను నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల ఎలక్షన్లపై దృష్టి సారించింది. అందుకనుగుణంగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. జనవరి మూడోవారంలో 117 మున్సిపాల్టీలకు, ఆరు కార్పొరేషన్లకు ఎన్నికల నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దీని కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ కూడా విడుదల చేసి విషయం విదితమే. కొత్త ఓటర్ల నమోదు, జాబితాపై ఎన్నికల అధికారులు దృష్టి సారించారు. ఈ నెల 10లోపు ఓటర్ల తుది జాబితాను పూర్తి చేయనుంది. ఆ తర్వాత ఎన్నికల షెడ్యూల్ జారీ చేయనుంది. పది రోజుల్లోనే ఎన్నికల ప్రక్రియను ముగించాలని ఎన్నికల సంఘం యోచిస్తున్నట్టు తెలిసింది. ఇదే అంశంపై మున్సిపల్ శాఖ అధికారులతో ఎన్నికల సంఘం సమాలోచనలు చేసింది. దీంతో ఈ నెలాఖరులోపు కొత్త మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్స్ కొలువుదీరనున్నారనే చర్చ జరుగుతోంది.

గడువు ముగిసి ఏడాది

రాష్ట్రంలో 2020 జనవరి 26న మున్సిపాల్టీల పాలకమండళ్లు కొలువుదీరాయి. వాటి గడువు 2025 జనవరి 26తో గడువు ముగిసింది. పాలకమండళ్ల కాలపరిమితి ముగిసి దాదాపు ఏడాది కావొస్తున్నది. అయితే ఇప్పటి వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. మొత్తం 130 మున్సిపాల్టీలకు గడువు ముగిసింది. 12 మున్సిపాల్టీలను కొత్తగా ఏర్పాటు చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి కాలపరిమితి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10న గడువు ముగియనుంది. ఇప్పుడు గ్రేటర్‌లో అదనంగా 27 మున్సిపాల్టీలను కలిపింది. వార్డుల విభజన కూడా జరిగింది. సరిహద్దులను ఖరారు చేసే పనిలో టౌన్ ప్లానింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 300 డివిజన్ల హద్దులను ఖరారు చేయడం, ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ఏప్రిల్‌లో మొదటివారంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఏడాది కాలంగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటంతో కొత్త పనులకు అనుమతి లేకుండాపోయింది. కొనసాగుతున్న పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో పెండింగ్ పనులు ముందుకు పోవడం లేదు. ఫలితంగా మున్సిపాల్టీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేస్తున్నాయి. ఏడాది కాలంగా ఎన్నికలు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బస్టాండ్‌లో బస్సు ఢీకొట్టి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హనుమకొండ జిల్లా పరకాల పట్టణ నడిబొడ్డున బస్టాండ్‌లో బుధవారం ఘోర ప్రమాదం జరిగింది. ములుగు జిల్లాకు చెందిన ఓ వృద్ధురాలు ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే... వరంగల్-2 డిపోకు చెందిన బస్సు భూపాలపల్లి నుంచి హనుమకొండ వైపు వెళ్తూ పరకాల బస్టాండ్‌లోకి మలుపు తీసుకుంది. రోడ్డు మలుపు వద్ద ఇరుకుగా ఉండడం, తోపుడు బండ్లు ఉండడంతో డ్రైవర్‌కు రోడ్డుపై నడుస్తున్న రాధమ్మ (70) కనిపించలేదు. బస్సు మలుపు తిరుగుతున్న వేగంలో ఆమెను బస్సు ఢీకొట్టింది. దాంతో బస్సు ముందు టైర్ వృద్ధురాలుపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మీతురాలు పాల్సాబ్‌పల్లికి చెందిన తోట రాధమ్మగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూతల స్వర్గధామం ములుగు ప్రకృతి అందాలు

- పర్యాటకులకు సాదర ఆహ్వానం పలుకుతున్నాం
- పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా పర్యాటకులకు భూతల స్వర్గధామంగా ఉందని, సహజసిద్ధ ప్రకృతి అందాలు, భక్తి, ఆనందం, ఆహ్లాదంతోపాటు చారిత్రాత్మక నేపథ్యం కలిగిన పర్యాటక ప్రదేశాలు నెలవై ఉన్నాయని పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా పర్యాటక అందాలను చూడటానికి వచ్చే పర్యాటకులకు సాదర ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. తాడ్వాయి మండల కేంద్రంలో బుధవారం ఎకో టూరిజం ఏటూరు నాగారం వైల్డ్ లైఫ్‌లోని తాడ్వాయి వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ రేంజ్, తాడ్వాయి హట్స్, రెండు సఫారీ వాహనాలను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడ్వాయి హట్స్ ఆవరణలో ఉన్న వివిధ జాతులకు చెందిన వృక్షాలు, వాటి ప్రయోజనాల గురించి పూర్తి వివరాలను డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ వివరించారు. ఆ తర్వాత వారంతా సఫారీ వాహనంలో తాడ్వాయి వైల్డ్ లైఫ్ రేంజ్ సుమారు ఏడు కిలోమీటర్ల మేర పర్యటించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు.. ఎకో టూరిజం ఏటూరు నాగారం వైల్డ్‌లైఫ్‌లోని తాడ్వాయి వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ రేంజ్‌లోని తాడ్వాయి హట్స్‌ను ఆధునీకరణంగా సుందరీకరించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ప్రపంచ పర్యాటకులను సైతం ఆకట్టుకుంటుందని, రామప్ప సరస్సు మధ్యగల ద్వీపకల్పంలో నూతనంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

త్వరలోనే పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. కొండల మధ్య కాకతీయులు నిర్మించిన లక్నవరం సరస్సు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుందని వివరించారు. పస్రా-తాడ్వాయి జాతీయ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దట్టమైన అటవీ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కలిగిన బ్లాక్ బెర్రీ ఐలాండ్‌ను పునఃప్రారంభించినట్టు తెలిపారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు నైట్ క్యాంప్ విడిది కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తెలంగాణ నయాగరా బొగత వాటర్ ఫాల్స్ చూపరులను ఆకట్టుకుంటుందన్నారు.

18 నెలల్లో 1,000 మంది విద్యార్థులకు శిక్షణ

- కీలక మైలు రాయిని చేరుకున్న స్కిల్ యూనివర్సిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కీలక మైలు రాయిని చేరుకుంది. 2024 ఆగస్టు 1న ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 18 నెలల్లో 1,000 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ అందించి అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. నైపుణ్య విద్యా రంగంలో ఇంత తక్కువ టైమ్‌లో ఈ స్థాయి లక్ష్యాన్ని అందుకోవటం విశేషం. పబ్లిక్, ప్రయివేట్ పార్టనర్ షిప్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తుండగా, పరిశ్రమల రంగానికి చెందిన ప్రముఖులతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పర్యవేక్షిస్తోంది. ఆనంద్ మహీంద్రా బోర్డు చైర్మెన్‌గా వ్యవహరిస్తున్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా డా. వీఎల్‌వీఎస్ఎస్. సుబ్బారావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీకి సంబంధించిన శాశ్వత క్యాంపస్ హైదరాబాద్ సమీపంలోని కందుకూరు మండలం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉంది. 57.8 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న ఈ క్యాంపస్‌లో 43 తరగతి గదులు, 600 పడకల హాస్టల్, 84 వేల చదరపు అడుగుల ఆధునిక ల్యాబ్ బ్లాక్ ఏర్పాటు చేస్తున్నారు. 2026 మార్చి నాటికి ఫేజ్-1 క్యాంపస్‌ను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శాశ్వత క్యాంపస్ సిద్ధమయ్యే వరకు హైదరాబాద్‌లో తాత్కాలిక క్యాంపస్‌లో శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్‌ఫర్మేషన్ సైన్స్ వంటి రంగాల్లో శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నారు. షార్ట్ టర్మ్, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా విద్యార్థులకు వెంటనే ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా నైపుణ్యాలు నేర్పుతున్నారు. మైక్రోసాఫ్ట్, రెడ్డీస్ ల్యాబ్స్, అపోలో హాస్పిటల్స్, కార్గో వంటి ప్రముఖ సంస్థలు యూనివర్సిటీతో భాగస్వామ్యం పంచుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవటంతో ఈ సంస్థలన్నీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాక్టికల్ ట్రైనింగ్, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయి. 2026-27 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ, పీజీ కోర్సులను ప్రారంభించేందుకు యూనివర్సిటీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పట్టాలే కాకుండా జాబ్ గ్యారంటీ లక్ష్యంతో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, తెలంగాణ యువతకు ఉద్యోగ భవితను అందించే కీలక కేంద్రంగా మారనుంది.

యూరియా 'యాప్'

- రైతులకు తప్పని తిప్పలు
- 24 గంటల్లో బస్తాలు తీసుకోకుంటే ఐడీ క్యాన్సిల్
- స్లాట్ బుక్ కాకపోతే ఎరువు లేనట్టే!
- పాత పద్ధతే కావాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు తమ పంట పొలాల్లో యూరియా చల్లాలంటే తప్పని సరిగా మొబైల్ యాప్‌లో నమోదు చేసుకోవాల్సిందే. తమ ఫోన్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని యూరియా కొనుగోలు చేయాలి. యూరియా కొనుగోలు చేయడానికి మొబైల్ ఫోన్ యాప్ ఆధారిత కొనుగోలు వ్యవస్థను రాష్ట్ర వ్యవసాయ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఎరువుల పంపిణీ, అమ్మకాలను సజావుగా నిర్వహించేందుకు ఈ ఫర్టిలైజర్ యాప్ రూపొందించబడిందని అధికారులు చెబుతున్నారు. ఇకపై యాప్‌లో బుక్ చేసుకున్నవారికే యూరియా ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే సాధారణ పద్ధతిలో యూరియా పంపిణీని అధికారులు నిలిపేశారు. ఈ కొత్త విధానంతో అన్నదాతల కష్టాలు రెట్టింపు కానున్నాయి. యూరియా కోసం ప్రభుత్వాన్ని, యాప్‌లో బుకింగ్ కోసం మరొకరిని బతిమాలుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవగాహన చేయకుండా ఎలా స్లాట్ ఎలా బుక్ చేసుకోవాలని మెజార్టీ రైతులు అంటున్నారు. వానాకాలంలో యూరియా కోసం రైతులు యుద్ధమే చేశారు. తీవ్రమైన యూరియా కొరతతో రాష్ట్రవ్యాప్తంగా ఏ ఎరువుల దుకాణం వద్ద చూసినా రైతులు, చెప్పులు, పాస్ పుస్తకాల క్యూలు కనిపించాయి. రైతులు రోజుల తరబడి దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూరియా కొరత పల్లెల్లో రక్తాన్ని పారించింది. కొన్నిచోట్ల రైతుల మధ్య తీవ్రమైన ఘర్షణలు జరిగాయి. ప్రస్తుత నిల్వలు, సరఫరా ప్రకారం యాసంగిలోనూ ఇదే పరిస్థితి వస్తుందని ప్రభుత్వం ముందే ఊహించి.. రైతులు, చెప్పుల క్యూలు కనిపించకుండా చేసేందుకు 'బుకింగ్ యాప్'ను తెరమీదికి తెచ్చింది. రైతులు ఒక్కసారిగా దుకాణాల వద్దకు వెళ్లకుండా నిలువరించాలని భావిస్తున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. రైతుకున్న మొత్తం భూమి, సాగు చేస్తున్న భూమి, పంట రకాల ఆధారంగా యూరియా బస్తాలు కేటాయిస్తారు. ఈ బస్తాలను కొనుగోలు చేయడానికి యాప్‌లో బుక్ చేసుకుంటే బుకింగ్ ఐడీ వస్తుంది. రైతులు ఎరువుల దుకాణాల వద్దకు వెళ్లి ఆ ఐడీని చెప్పి యూరియా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. బుక్ చేసుకున్న బ్యాగులు ఒక రోజు రిజర్వ్ చేయబడతాయి, ఈ బుకింగ్ 24 గంటలు మాత్రమే చెల్లుతుంది.

రైతులకు అవగాహన కల్పిస్తేనే ఉపయోగం..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ యాసంగి నుంచి వ్యవసాయానికి రైతులకు యూరియా అందించేందుకు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను తీసుకువచ్చారు. ఈ యాప్ ద్వారానే యూరియా కావాల్సిన రైతులు బుక్ చేసుకోవాలి. ప్రతి రైతు తమ ఫోన్లలోనో లేక తెలిసిన వారి ఫోన్లలోనో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. అందులో అడిగే వివరాలను నమోదు చేయాలి. యూరియా బుకింగ్ యాప్ బాధ్యతను ఉన్నతాధికారులు ఏఈవోలు, డీలర్లపైనే మోపారు. యాప్ పనిచేసే విధానంపై ఏఈవోలు, డీలర్లకు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో అవగాహన కల్పించారు. అయితే నేరుగా యాప్ అందుబాటులో లేకపోవడంతో మెజారిటీ ఏఈవోలు, డీలర్లకు దాన్ని ఎలా వినియోగించాలనే అంశంపై స్పష్టత రాలేదని చెప్తున్నారు.

పాత పద్ధతిలో యూరియా పంపిణీ చేయాలి :
రైతు సంఘం రాష్ట్ర నాయకులు జి.జయరాజ్

రైతులకు పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలి. స్మార్ట్‌ఫోన్లతో రైతులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదు. రైతులందరూ స్మార్ట్ ఫోన్లు వాడరు. వారు బుకింగ్ చేసుకోలేరు. పాత పద్ధతిలోనే పీఏసీఎస్ సొసైటీలు, ఎరువుల దుకాణాల ద్వారా యథావిధిగా యూరియాను సరఫరా చేయాలి.

కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

చలిలో 'యూరియా' తిప్పలు

- తెల్లవారుజామునే బారులు తీరిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూరియా తిప్పలు మొదలయ్యాయి. ఎముకలు కొరికే చలిని సైతం తట్టుకుంటూ రైతులు బుధవారం తెల్లవారుజామునే లైన్‌లో నిలబడ్డారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో రెండు దుకాణాలకు రెండు లారీల యూరియా వచ్చిందని తెలుసుకొని పెద్దఎత్తున రైతులు తరలివచ్చారు. నిజాంపేటతోపాటు వివిధ గ్రామాల రైతులు వచ్చి యూరియా కోసం నిరీక్షించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. యాసంగి నాటు వేసే సమయం దాటితే ఇబ్బంది అవుతుందని, సమయానికి యూరియా వేయాలని అన్నారు. యూరియా కోసం ఇన్ని గంటలు లైన్‌లో నిలవడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. అధికారులు చొరవ తీసుకొని అందరికీ యూరియా అందించాలని కోరారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి చెప్పారు. మండలానికి 2000 యూరియా బస్తాలు, 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా బస్తాలు కేటాయించారని తెలిపారు. మరో రెండ్రోజుల్లో రైతులందరికీ సరిపడా యూరియాను అందిస్తామన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డి ఊహల నగరం ఫోర్త్‌సిటీ

- బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హైదరాబాద్ నగరమంటే చిన్నచూపు, ద్వేషమని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్‌ను మొదటి నుంచి చెత్తనగరంగా చూస్తున్నారని అన్నారు. ఆయన ఊహల నగరం ఫోర్త్‌సిటీ అని చెప్పారు. రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు మెట్రోను రద్దు చేశారని వివరించారు. మూసీ ప్రక్షాళన పేరుతో ఎక్కడపడితే అక్కడ కూల్చివేతలకు పాల్పడ్డారని అన్నారు. హైదరాబాద్‌లో కాలుష్యం లేకుండా ఫార్మాసిటీని కట్టాలని బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి సిఎం అయ్యాక హైదరాబాద్ పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని చెప్పారు. మహేశ్వరం, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల నియోజకవర్గాల్లోని గ్రామాలను కార్పొరేషన్‌లో కలిపి అక్కడి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. పేరుకే ప్రజాపాలన చేసేది రాజరిక పాలన అని విమర్శించారు. ప్రజలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకోకుండా 27 మున్సిపాల్టీలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేశారని చెప్పారు. మంత్రులు, అధికారులు, మేయర్‌కు తెలియకుండా 300 వార్డులను చేశారని వివరించారు. రేవంత్‌రెడ్డి నియంతృత్వ పాలన చేస్తున్నారని అన్నారు. ఆయన నిర్ణయాలను కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని వివరించారు. ఇంగ్లాండ్‌లో పార్లమెంటు సమావేశాలు ఏడాదికి 160 రోజులు జరుగుతాయని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ గతేడాది 16 రోజులే నడిచిందన్నారు. జీరో అవర్ జీరో ఆన్సర్‌గా మారిందని అన్నారు. అసెంబ్లీ సమావేశాలను 15 రోజులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎం రాజశేఖర్ రెడ్డి

- రాష్ట్ర కార్యదర్శులుగా మరో నలుగురు ఎన్నిక
- వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక
- ప్రధాన సంపాదకులుగా కె జంగయ్య నియామకం
- ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై పలు తీర్మానాల ఆమోదం

రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎం.రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులుగా పి.నాగేశ్వర రావు, పి.వెంకటేశం, ఎన్.సోంబాబు, సిహెచ్.విశాలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఆఫీసు బేరర్లలో ఏర్పడిన ఖాళీలకు జనగామలో జరిగిన రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాలలో నిర్వహించిన ఎన్నికల్లో వీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక ప్రధాన సంపాదకులుగా రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కె.జంగయ్య నియమితులయ్యారు. అంతకుముందు సమావేశంలో రేషనలైజేషన్ జిఒను సవరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికొక ఉపాధ్యాయుడిని నియమించాలనీ, అన్ని పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించాలనీ, డిఇఒ, డిప్యూటీ ఇఒ, ఎంఇఒ తదితర పర్యవేక్షణ అధికారులను నియమించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని తదితర విద్యా రంగ తీర్మానాలను ఆమోదించారు. రిటైర్మెంట్ వయస్సును పెంచే ప్రతిపాదనను విరమించుకోవాలనీ, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.పది వేల కోట్లు అప్పు తెచ్చైనా సరే వారికి బెనిఫిట్స్ ఏకమొత్తంగా చెల్లించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, పిఆర్సీని వెంటనే ప్రకటించి 1.07.2023 నుంచి అమలు చేయాలనీ, సీనియర్ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుంచి మినహాయించాలని కూడా సమావేశంలో తీర్మానించారు. గురుకులాల టైమ్ టేబుల్ సవరించాలనీ, మోడల్ స్కూల్స్, గురుకులాల సిబ్బందికి 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలనీ, కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని తదితర తీర్మానాలను రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆమోదించినట్టు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు.

టాప్ర రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి నారాయణరెడ్డి, పి కృష్ణమూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్ల సంఘం (ట్రాప) రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. టాప్ర రాష్ట్ర అధ్యక్షులుగా పి నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో రెండురోజులపాటు జరిగిన టాప్ర రాష్ట్ర ఆరో మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా పి నారాయణరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర, ఇపిఎస్, సిఎంపిఎస్‌తోపాటు ఇతర పెన్షనర్లను కలుపుకుని ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉద్యమంలోకి మహిళలను ఎక్కువగా ఆహ్వానిస్తామని అన్నారు. సామాజిక బాధ్యతగా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. టాప్ర ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను విభజించి పాలిస్తున్నాయని విమర్శించారు. వాలిడేషన్ ఆఫ్ సీసీఏ (పెన్షన్) నిబంధనల పేరుతో దుర్మార్గమైన చట్టాలను కేంద్రం తయారు చేసిందన్నారు. వాటిని రద్దు చేసేదాకా పెన్షనర్లందరినీ కలుపుకుని ఐక్యంగా పోరాడతామని చెప్పారు. 2024 తర్వాత రిటైరైన వారి పెన్షన్ బెనిఫిట్లు చెల్లించాలంటే నెలకు రూ.700 కోట్లు సరిపోవనీ, కనీసం రూ.1,500 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.